# జనరంజక పాలన

- బీఆర్‌ఎస్ హయాంలోనే అభివృద్ధి
- ఎవరెన్ని జిమ్మిక్కులు చేసినా ఎగిరేది గులాబీ జెండానే
- కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరు
- బీజేపీకి తెలంగాణలో అడ్రస్ గల్లంతే..
- ఎక్సైజ్, క్రీడా శాఖల మంత్రి శ్రీనివాస్‌గౌడ్


మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు స్వాగతం పలుకుతున్న ప్రజలు


అన్నం వండుతున్న మంత్రి


మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్

మహబూబ్‌నగర్ టౌన్/పాలమూరు, అక్టోబర్ 30 : ఎవరెన్ని కుట్రలు పన్నినా.. ప్రజలకు చేసిన మంచే మమ్మల్ని మూడోసారి అధికారంలోకి తీసుకొస్తుందని ఎక్సైజ్, క్రీడా శాఖల మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మహబూబ్‌నగర్ మండలం తువ్వగడ్డ తండా, ఫతేపూర్, భవానీతండా, పల్లెగడ్డతండా, బోడబండతండాలో మంత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాలకు వెళ్లిన మంత్రికి మహిళలు బోనాలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. కర్ణాటకలో అక్కడి ప్రజలు కాంగ్రెస్‌ను నిమ్మితే నిండా ముంచేశారని, కనీసం కరెంటు ఇవ్వడం చేతకావడం లేదన్నారు. దీంతో రైతులంతా నష్టపోయి రోడ్డెక్కి నిరసన తెలుపుతున్నారన్నారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పాటుపడుతుండగా.. రైతుల కడుపుకొట్టేలా రైతుబంధును ఆపేందుకు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయ డం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ పార్టీని ప్రజలు తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్‌ను ఇప్పటికే ప్రజలు పాతరేసేందుకు నిర్ణయించుకున్నారని, ప్రజల మధ్య కులమతాల పేరుతో చిచ్చుపెట్టే బీజేపీ పార్టీ తెలంగాణలో అడ్రస్ లేకుండా పోవడం ఖాయమన్నారు. ఫతేపూర్‌కు చెందిన బీజేపీ నాయకులు శేఖర్, వెంకట్రాములు, శ్రీశైలం, మల్లేశ్, ఖాసీం, కృష్ణ, వెంకటయ్య మంత్రి సమక్షంలో చేరారు.

**కాంగ్రెస్ పాలన వద్దు..**

ఫతేపూర్‌లో బీబీ అనే మహిళ ఇప్పటికీ కట్టెల పొయ్యి మీద వంట వండుతున్నది. గమనించిన మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆమె వద్దకు వెళ్లి మాట్లాడారు. బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తే రూ.400కే వంటగ్యాస్ అందిస్తామని చెప్పారు. ఇందుకు మహిళ కృతజ్ఞతలు తెలిపి మాట్లాడారు. కర్ణాటకలో కాంగ్రెసోళ్లు చేస్తున్న పాలనతో ప్రజలు చీదరించుకుంటున్నామని, మా మద్దతు బీఆర్‌ఎస్‌కే ఉంటుందన్నారు.అనంతరం పట్టణంలోని 10వ వార్డు క్రిష్టయన్‌పల్లి, అయోధ్యనగర్, ఆదర్శనగర్, శ్రీరామకాలనీ, డబుల్‌బెడ్రూం కాలనీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మంత్రికి కార్యకర్తలు, ప్రజలు ఘన స్వాగతం పలికారు. క్రిష్టయన్‌పల్లి డబుల్ బెడ్రూం కాలనీలో మాట్లాడారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా క్రిష్టయన్‌పల్లి డబుల్ బెడ్రూం కాలనీ వద్దకు వచ్చిన మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు స్థానికుల నుంచి ఆత్మీయ పలకరింపు లభించింది. గూడు లేని తమకు డబుల్ బెడ్రూం ఇల్లు ఇచ్చారని, జీవితాంతం తోడుంటామన్నారు.

**రాజకీయంగా ఎదుర్కోలేక దాడులు చేస్తారా?**

మహబూబ్‌నగర్, అక్టోబర్ 13 : మెదక్ పార్లమెంట్ నియోజకవర్గం ఎంపీ, దుబ్బాక అసెంబ్లీ బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై జరిగిన హత్యయత్నాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ స్పష్టం చేశారు. నీచ రాజకీయాలు చేస్తున్న ప్రతిపక్షాల వైఖరిని ప్రజలు గమనించాలని కోరారు.

**లక్ష మెజార్టీ ఖాయం..**

మహబూబ్‌నగర్ అర్బన్, అక్టోబర్ 30 : మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్ సోమవారం జిల్లా కేంద్రంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మారుతున్న మహబూబ్‌నగర్ ముఖచిత్రం పేరిట నియోజకవర్గ అభివృద్ధిపై రచించిన పుస్తకాన్ని ఎర్రశేఖర్‌కు మంత్రి అందజేశారు. నియోజకవర్గాన్ని ఊహించని విధంగా అభివృద్ధి చేసిన మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఈ ఎన్నికల్లో లక్ష మెజార్టీ ఖాయమని ఎర్రశేఖర్ స్పష్టం చేశారు.


## మంత్రి మహేందర్‌రెడ్డి సమక్షంలో చేరికలు

కొడంగల్, అక్టోబరు 30 : బీఆర్‌ఎస్‌లో కొనసాగుతున్న రోజువారి జోరు చేరికలతో కాంగ్రెస్‌కు హడలెత్తుతుందని, కాంగ్రెస్‌లో చేరేవారు లేక పోవడంతో కొనుగోలు వ్యాపారం చేస్తున్నట్లు మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని మంజూనాథ బ్లాంకెట్ హాల్‌లో నియోకవర్గంలోని మద్దూర్ మండలంలోని చెన్నారెడ్డిపల్లి, మల్‌రెడ్డిపల్లికి చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు మంత్రి మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి సమక్షంలో 300ల మంది కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు.


మంత్రి, ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న కాంగ్రెస్ కార్యకర్తలు

## మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి


ఎమ్మెల్యే ఆల సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తలు

దేవరకద్ర రూరల్ (చిన్న చింతకుంట), అక్టోబర్ 30 : మైనార్టీల సంక్షేమానికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తున్నదని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం చిన్నచింతకుంట మండల కేంద్రంలో నిర్వహించిన దేవరకద్ర నియోజకవర్గ క్రైస్తవుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం రావాలని క్రైస్తవులు ఎంతో ప్రార్థించారని గుర్తుచేశారు. యేసు ప్రభువు, ప్రజల ఆశీర్వాదంతో రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందానని చెప్పారు. అనంతరం ఆల వెంకటేశ్వర్‌రెడ్డి మూడోసారి గెలవాలని పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం చిన్నచింతకుంట మండలం గూడూరుకు చెందిన బీజేపీ, కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే ఆల సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో ఎంపీపీ హర్షవర్ధన్‌రెడ్డి, ఎంపీటీసీ ఉషారాణి, రైతుబంధు సమితి జిల్లా సభ్యుడే కరుణాకర్‌రెడ్డి, పీఏసీసీఎస్ అధ్యక్షుడు సురెందర్‌రెడ్డి, ఉమామహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**సీఎం సభాస్థలి పరిశీలన..**

దేవరకద్ర, అక్టోబర్ 30 : దేవరకద్రలో సీఎం కేసీఆర్ సభ నవంబర్ 6వ తేదీన నిర్వహించనున్న నేపథ్యంలో ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి సోమవారం సభా స్థలాన్ని పరిశీలించారు. దేవరకద్ర ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల సమీపంలో ఉన్న దేవస్థాన స్థలంలో సభకు సంబంధించి ఏర్పాట్లను పరిశీలించారు.

## కాంగ్రెస్‌కు ఓటేస్తే కర్ణాటక గతే..

- ఎన్నికల ప్రచారంలో జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

జడ్చర్ల, అక్టోబర్ 30 : కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే కర్ణాటక గతే తెలంగాణలోనూ వస్తుందని, ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని జడ్చర్ల ఎమ్మెల్యే డాక్టర్ లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం జడ్చర్ల మండలంలోని మూస్తంభంతండా, నేలబండ తండా, వాయిల్‌గడ్డతండా, ఎక్వాయిపల్లి, పెద్ద ఆదిరాల, రామస్వామిగుట్ట తండా, చిన్నఆదిరాల, తుపుడగడ్డతండా, కొల్లోనిమోర్ల, చంద్రుతండాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికలు రావడంతో కాంగ్రెస్ పార్టీ నాయకులకు ప్రజలకు మాయమాటలు చెప్పి ఓట్లు వేసుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. మూడోసారి కేసీఆర్‌ను ముఖ్యమంత్రి చేయాలని కోరారు. అంతకుముందు ప్రచారానికి వచ్చిన ఎమ్మెల్యేకు ప్రజలు, నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున స్వాగతం పలికారు. వాయిల్‌గడ్డతండా, ఎక్వాయిపల్లిలో మహిళలు బతుకమ్మ ఆడారు.

**మేముసైతం లక్ష్మన్న కోసం..**

జడ్చర్ల, అక్టోబర్ 30 : జడ్చర్ల మండలంలోని పెద్దఆదిరాలలో బీఆర్‌ఎస్ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తుండగా గ్రామానికి చెందిన ఇద్దరు చిన్నారులు చిన్న వాహనానికి బీఆర్‌ఎస్ జెండాను కట్టించుకొని తిరిగారు. వీరి వాహనం ప్రచారంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.


ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి స్వాగతం పలుకుతున్న ప్రజలు


బీఆర్‌ఎస్ జెండాతో చిన్నారులు

## ప్రజలు ఆలోచించి ఓటు వేయాలి

- కాంగ్రెస్‌ను నమ్మితే కష్టాలు తప్పవు
- నారాయణపేట ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి
- మరికల్‌లో ఎన్నికల ప్రచారం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

మరికల్, అక్టోబర్ 30 : బీఆర్‌ఎస్‌తోనే ప్రజా సంక్షేమం సాధ్యమని, కాంగ్రెస్‌ను నమ్ముకుంటే నట్టేట ముంచడం ఖాయమని నారాయణపేట ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం మండలంలోని మాధ్వార్, ఇబ్రాహీంపట్నం, ఎల్లిగండ్ల, పస్పుల గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న కర్నాటకలో కరెంట్ కష్టాలతో రైతులు అవస్థలు పడుతున్నారు. కారు పార్టీ అధికారంలో ఉన్న తెలంగాణలో కర్షకుడు ఆనందంగా ఉన్నాడన్నారు. కాంగ్రెస్‌తో వచ్చే కరెంట్ కష్టాలు కావాలో, కారు పార్టీతో వచ్చే కర్షకుడి ఆనందం కావాలో ప్రజలు ఆలోచించాలన్నారు. కార్యక్రమంలో నారాయణపేట నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి దేవరి మల్లప్ప, సీనియర్ నాయకుడు విఠాల్‌రావు ఆర్యా, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ గౌని సురేఖారెడ్డి, వైస్ ఎంపీపీ రవికుమార్ పాల్గొన్నారు.

**పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి..**

ధన్వాడ, అక్టోబర్ 30 : అభివృద్ధి పనులతోపాటు సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి నాయకులు, కార్యకర్తలకు సూచించారు. సోమవారం మండల కేంద్రంలో మరికల్, ధన్వాడ మండలాల బూత్ స్థాయి కార్యాకర్తల సమావేశం నిర్వహించారు.

**బీఆర్‌ఎస్‌లో చేరికలు..**

కోయిలకొండ, అక్టోబర్ 30 : మండలంలోని శేరివెంకటాపూర్‌లో ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి సమక్షంలో గార్లపహడ్, అభంగపట్నం, శేర్‌పల్లి, ఇబ్రహీంనగర్ గ్రామాల నుంచి కాంగ్రెస్, బీజేపీ పార్టీల నుంచి 400 మంది నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు.

## అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- కులం, మతంపేరుతో కాంగ్రెస్, బీజేపీ రాజకీయం
- అన్నివర్గాల సంక్షేమానికి సీఎం కేసీఆర్ కృషి
- మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి


ఎమ్మెల్యే చిట్టెం సమక్షంలో బీఆర్‌ఎస్ లో చేరిన కాంగ్రెస్, బీజేపీ, సీపీఐ కార్యకర్తలు

అమరచింత, అక్టోబర్ 30 : తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత తొమ్మిదేండ్లలోనే సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలు, సబ్బండ వర్గాల అభివృద్ధికి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు వివరించాలని మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మక్తల్ అసెంబ్లీ ఎన్నికల పర్యవేక్షకుడు అంజనేయులుగౌడ్, మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షురాలు చిట్టెం సుచరితరెడ్డితో కలిసి సోమవారం పట్టణంలోని జమ్ములమ్మ ఆలయం ఆవరణలో బీఆర్‌ఎస్ మండల విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలపై ఆ పార్టీ నాయకులకే గ్యారెంటీ లేదన్నారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు కులం, మతం పేరుతో ప్రజల మధ్య చిచ్చుపెడుతూ ఓట్ల కోసం రాజకీయం చేస్తున్నాయని మండిపడ్డారు. నవంబర్ 6న మక్తల్‌లో నిర్వహించే సీఎం బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ నాగభూషణంగౌడ్, అమరచింత మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, అమరచింత జెడ్పీటీసీ మార్క సరోజ, వైస్ ఎంపీపీ బాల్‌రెడ్డి తదితరులుపాల్గొన్నారు.

**ఎమ్మెల్యే చిట్టెం సమక్షంలో చేరికలు..**

మండలంలోని మిట్టనందిమల్లకు చెందిన కాంగ్రెస్ నాయకుడు మహేందర్, అలాగే బీజేపీ కార్యకర్తలు, సీపీఐ కార్యకర్త దేవరాజు ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వీరికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

## సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

నారాయణపేట, అక్టోబర్ 30 : సీఎం కేసీఆర్ పర్యటనకు జిల్లాలో పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎస్పీ యోగేశ్‌గౌతమ్ తెలిపారు. నవంబర్ 6వ తేదీన సీఎం కేసీఆర్ నారాయణపేట, మక్తల్ నియోజకవర్గాల్లో పర్యటించనున్న నేపథ్యంలో సోమవారం ఎస్పీ సీఎం పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. సభాస్థలి, గ్యాలరీ, హెలీప్యాడ్, పార్కింగ్, ట్రాఫిక్ డైవర్షన్ తదతర ఏర్పాట్లు పరిశీలించారు.